ఆ తీర్పుకి ఆశ్చర్యపోయిన అతను చిత్రగుప్తుణ్ణి ఇలా అడిగాడు..

"ఇదన్యాయం స్వామి. నేను ఈ బిచ్చగాడికన్నా ధనవంతుణ్ని. ఇలాంటి ఎందరో బిచ్చగాళ్ళకి అనేక వస్తువులు దానం చేసాను. నాకన్నా ఎక్కువ పుణ్యాన్ని ఇతనెలా ఆర్జించగలడు? మీరు పొరబడ్డారంటాను."

"పొరబాటేంలేదు. వీడు ఓ చలికాలం రాత్రి ఓ వృద్ధుడికి కప్పుకునేందుకు ఈ కంబళిని దానం చేసాడు." అని చిత్రగుప్తుడు ఆ కంబళిని చూపించాడు. దాన్ని గుర్తుపట్టిన అతను వెంటనే చెప్పాడు.

"ఇది నేను స్వయంగా నా చేతులతో వీడికిచ్చిన కంబళే. మరి నా దానఫలం ఏమైంది?"

అందుకు చిత్రగుప్తుడు నవ్వి జవాబు చెప్పాడు.

"నువ్వు నీ జీవితకాలంలో దానం చేసినవన్నీ నీకు అవసరం లేవనుకున్నవీ, ఇంట్లో అడ్డుగా ఉన్న చెత్త సామానునే. కాని ఈ బిచ్చగాడు తనకి చలిరాత్రి గజగజ వణికించే చలిని లక్ష్యపెట్టక అత్యంత అవసరమైన కంబళిని తనకన్నా వృద్ధుడైన వాడికి దానం చేసాడు. తద్వారా ఇతను తన స్వార్థాన్ని పక్కకి పెట్టి రోగగ్రస్తుడైన ఇంకో బిచ్చగాడికి సహాయపడటం ద్వారా నీకన్నా ఎన్నో వేలరెట్లు పుణ్యాన్ని ఆర్జించాడు. నీకూ ఇతనికి తేడా అక్కడ వచ్చింది."

## 57. రాముడి రుచి

ఓ చోట నాస్తికసభ జరుగుతోంది. అనేకమంది వక్తలు దేవుడు లేడని ఉపన్యాసాలు ఇస్తున్నారు. జామ పళ్ళు కొనుక్కుని ఒకటి తింటూ ఇంటికి వెళ్తున్న ఓ ఆస్తికుడు ఆ సభ పక్కనించి వెళ్తూంటే, అతనికి దేవుడనే వాడే లేడని, రాముడు కృష్ణుడు అని పేర్లు పెట్టుకుని ఆస్తికులు తమని తాము మోసం చేసుకుంటున్నారన్న మాటలు వినిపించాయి. ఆయన కరకర దోర జామకాయని నములుతూ ఆ సభలోకి వెళ్ళాడు.

"...ఆ రోజుల్లో ఆటవిక జీవనం సాగేది. అడవిలో ఏం జరుగుతుంది? పులి లేడిని తింటుంది. నక్క కుందేలుని తింటుంది. బలమైన జంతువు బలహీనమైన జంతువుని తినడం చూసిన ఆటవిక మానవుడు కూడా అదే ప్రవర్తనని అలవరచుకున్నాడు. ఆ క్రమంలో బలవంతుడైన మగాడు బలహీనమైన మగాడి భార్యని ఎత్తుకు వెళ్ళేవాడు.

ఓసారి ఇలాగే జరిగితే ఆ బలహీనమైన మగాడు కొందర్ని కూడగట్టుకుని ఆ బలవంతుడి మీదకి వెళ్ళి, అతన్ని చంపి తన భార్యని తిరిగి తెచ్చుకున్నాడు. బలాన్ని గౌరవించే ఆ మానవులకి ఇది అద్భుతంగా తోచింది. దాన్ని వారు తరతరాలుగా కథలుగా చెప్పుకోసాగారు. ఎవరికి తోచింది వాళ్ళు ఆ కథకి జోడించుకుంటూ వస్తే అది చాంతాడంతయి రామాయణం అయింది. అడవిలో కనబడే భల్లూకం, కోతి లాంటి పాత్రలని తీసుకుని హనుమంతుడు, జాంబవంతుడు లాంటి పేర్లతో ఓ ఆటవిక కవి దీన్ని గ్రంథస్థం చేసాడు. అంతే తప్ప రాముడు దేవుడు కాదు..."

"ఒక్క క్షణం." ఆ ముసలాయన ఆ ఉపన్యాసకుడితో చెప్పాడు.

తన వాగ్ధాటికి అడ్డు తగిలిన ఆ ముసలాయన వంక ఆ వక్త కోపంగా చూసాడు. వార్ధక్యంవల్ల వణికే స్వరంతో అడిగాడాయన.

"మీరు చెప్పేదంతా బాగుంది. నాకో సహాయం చేస్తారా?"

"ఏమిటది?" అడిగాడు ఆ వక్త.

"నేను తింటున్న ఈ జామకాయ రుచి గురించి నాలుగు మాటల్లో చెప్తారా?" అడిగాడాయన.

"ఇది మరీ బావుంది. తినేది మీరు. ఆ రుచి నాకెలా తెలుస్తుంది?" ఆశ్చర్యంగా అడిగాడా వక్త.

"అలా అంటారేమిటి? నా రాముడి రుచి తెలీకుండానే ఇప్పుడు మీరు మాట్లాడుతున్నట్లుగానే." జవాబు చెప్పాడా ముసలాయన.